రాజీవ్‌గాంధీనగర్‌లో పార్కు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీ నగర్ పార్కు పనులను కార్పొరేటర్ సబిహా బేగం, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో ఖాళీ ప్రదేశంలో పార్కు, ఓపెన్‌గార్డెన్ నిర్మాణం చేపట్టామన్నారు. పనులు పూర్తయితే ఓపెన్ గార్డెన్‌లో పేద, మధ్య తరగతి వారు చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, అస్లాం, సలావుద్దీన్, మల్లేశ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఆల్విన్‌కాలనీ: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గోదా కృష్ణ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నియోజకవర్గం నుంచే తన రాజకీయ ప్రస్థానం మొదలైందని, కౌన్సిలర్‌గా గెలుపొంది వైస్ చైర్మన్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా, కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను తిట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నదన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీలో నాయకులు చేరారు తప్ప కార్యకర్తలందరూ బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని పేర్కొన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీనిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వందశాతం విజయం సాధించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవ సభ కాదు సంవత్సరికం జరుపుకుంటున్నదని అన్నారు. భవిష్యత్‌లో పార్టీకి మళ్లీ మంచి రోజులు వస్తాయని, కష్టపడి పని చేసే నాయకులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, జూపల్లి సత్యనారాయణ, కే జగన్, మంత్రి సత్యనారాయణ, సంతోష్‌రావు, రాములు గౌడ్, సమద్, ఖాజా, జగదీశ్, సాయిగౌడ్, మనీశ్ గౌడ్, మహేశ్, నాగేశ్వరరావు, మాచర్ల భద్రయ్య, ఏడుపాయల శ్రీను, శంకర్, లక్ష్మణ్, అడ్వకేట్ శ్రీనివాస్, రామస్వామి, పాండు పాల్గొన్నారు.



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

మోతీనగర్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ రాధాకృష్ణనగర్‌లో జన్ శిక్షణ సంస్థాన్, పీజేఆర్ అభిమాన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శిక్షణ కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉచిత శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మరో నలుగురికి ఉపాధి కల్పించేలా ఎదగాలని సూచించారు. అనంతరం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ డైరెక్టర్ నరహరి, డ్యూటీ డైరెక్టర్ జయశంకర్, ప్రొఫెసర్ ఎస్‌ఎం పిరాన్, బీ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, పీజేఆర్ అభిమాని సంఘం ప్రతినిధి ఎస్, సుభాష్, కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి, నల్లమాల్పు అంజిరెడ్గి, కల్యాణి, బషీర్, జేవీ కృష్ణారెడ్డి, ఎం. విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈనెల 20న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాకేశ్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మైహోం ఫీడర్ పరిధిలోని సీజీఆర్ స్కూల్ ప్రాంతం, బొల్లినేని హోమ్స్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11 కేవీ అల్లాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు గాయత్రీనగర్, జ్యోతినగర్, చంద్రగార్డెన్స్ ప్రాంతాల్లో అదేవిధంగా హర్యాందయ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు మెరిడియన్ స్కూల్ ప్రాంతం, బాలాజీ ఆలయం రోడ్డు, 100 ఫీట్ల రోడ్డు, సలీం టీ పాయింట్, టాటా మోటార్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బాలాజీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో..

మూసాపేట: బాలాజీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ భీమ లింగప్ప తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బాలాజీనగర్, న్యూ బాలాజీనగర్, కల్యాణి జ్యువెల్లర్స్, రాందేవ్ హాస్పిటల్, బిగ్‌సీ, ఆకార్ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వాములకు శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ హాజరై స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజు గౌడ్, లింగయ్య, గోపాల్‌రెడ్డి, సాయి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రహరీలు నిర్మించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని కల్యాణినగర్, సాయినగర్‌లోని పలు ప్రాంతాల్లో కంపౌండ్ వాల్స్ నిర్మించాలని కోరుతూ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరబండ రాజునగర్ శ్మశాన వాటిక ఆనుకుని ఉన్న గోడ కల్యాణినగర్ , కట్ట మైసమ్మ ఆలయం వెనుకవైపు నుంచి, అదేవిధంగా సాయినగర్ కెమికల్ నాలా సమీపం నుంచి ఇళ్లలోకి పాములు వస్తున్నాయని రాకుండా ప్రహరీలు నిర్మించాలని కోరానని తెలిపారు.

అవార్డు స్వీకరణ



అవార్డు అందుకుంటున్న రిటైర్డు హెచ్‌ఎం విజయలక్ష్మి

కూకట్‌పల్లి: శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా రిటైర్డ్ హెచ్‌ఎం సీహెచ్. విజయలక్ష్మి టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు–2024ను మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కష్టాన్ని గుర్తించి శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ అనేక అవార్డులు అందుకున్నానని తెలిపారు.

ప్రజా శ్రేయస్సుకే సమగ్ర సర్వే

చింతల్: పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిందని గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి అన్నారు. భగత్‌సింగ్‌నగర్‌లో కొనసాగుతున్న సర్వేను స్పెషల్ ఆఫీసర్ మయాంక్ మిట్టల్‌తో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో భద్రపరిచిన సర్వే పత్రాలను పరిశీలించారు. అలాగే ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీ హరిప్రియ, నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు ఉచిత వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం పరీక్షలు చేయించుకుంటున్న జోన్ డీసీపీ సురేశ్ కుమార్

మూసాపేట: గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలానగర్ జోన్ పోలీస్ అధికారుల కోసం కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్ ప్రారంభించారు. పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా కేన్సర్ టెస్ట్ శిబిరం నిర్వహించామని తెలిపారు. పోలీసులు ఉద్యోగరీత్యా తీవ్ర ఒత్తిడితో ఉంటారని, ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

అపోలో సంస్థల ఆధ్వర్యంలో..



వీ రామారావునగర్‌లో ..

మోతీనగర్: అపోలో సంస్థల ఆధ్వర్యంలో వీ రామారావునగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత, కొలెస్ట్రాల్, బీపీతో పాటు సాధారణ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మూడు నెలలకు ఒకసారి సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు గంట నడక, జిమ్, వ్యాయామం చేస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర, అపోలో పీఆర్ సతీశ్, సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో ప్రతిభ



వినీతను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్

బాలానగర్: నేపాల్ దేశంలో జరిగిన ఖోఖో పోటీల్లో బాలానగర్ డివిజన్ సాయినగర్‌కు చెందిన గోపాల్‌నాయక్ కుమార్తె వినీత ప్రథమ బహుమతి గెలుచుకుంది. దీంతో వినీతను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ థాయిలాండ్‌లో జరిగే పోటీలకు ఎంపికైన వినీతకు అండగా ఉంటామని హామీనిచ్చారు.

3న బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

కుత్బుల్లాపూర్: డిసెంబర్ 3న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు గండి మైసమ్మలోని పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వారు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నిలిచిన రోడ్ల పనుల పరిశీలన



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: భవానీనగర్‌లో కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సాయిలు, సుందర్, శేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జీడిమెట్ల: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్ డిపో ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికుల స్వేచ్ఛను హరించేలా 2019లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంఘాలపై ఆంక్షలు విధించిందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని డిపోల మేనేజర్లు ఏకపక్షంగా వ్యవహరిస్తూ డ్యూటీల విషయంలో డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మహిళా సిబ్బందికి సైతం రాత్రి 11 గంటల వరకు విధులు అప్పగించడం సరైన పద్ధతి కాదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంఘాల ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆంక్షలను తొలగించి వెంటనే యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు రావుల స్వాతి, శీను మల్లారెడ్డి, ఆంజనేయులు, యాదవరెడ్డి, తిమ్మప్ప, వీరేశ్, దుర్గానాయక్, మల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు



పరీక్ష ఫీజులు చెల్లిస్తున్న విజయ్‌కుమార్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సింగిల్ పేరెంట్ విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ఫీజులు చెల్లించారు. సాయి సంజీవని మెడికల్ దుకాణం యజమాని శ్రీనివాస్ అందించిన ఆర్థిక సాయంతో 23 మంది విద్యార్థులకు చెందిన ఫీజులు చెల్లించామని సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



కేపీహెచ్‌బీకాలనీ రాజీవ్‌గాంధీ సర్కిల్ వద్ద మాజీ కేంద్ర మంత్రి సర్వే , కూకట్‌పల్లి ఇన్‌చార్జి రమేశ్

కూకట్‌పల్లి: నియోజకవర్గవ్యాప్తంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీకాలనీలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నియోజకవర్గ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఇందిరా చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చౌరస్తాలో..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు షాయిన్‌షా, రాజేందర్, జహంగీర్, మహిళలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గోపిశెట్టి రాఘవేందర్ తదితరులు



ఎస్‌కే జావిద్ ఆలీ తదితరులు..



హస్మత్‌పేట చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న బండి రమేశ్, టీపీసీసీ కార్యదర్శి యాదగిరి



శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన ఏకాంత్ గౌడ్ తదితరులు

పారిశ్రామికవాడలో వసతుల కల్పనకు కృషి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ధూలపల్లి ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (దివ) సభ్యులు ఆయనను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిమెట్ల–ధూలపల్లి పారిశ్రామికవాడ ప్రధాన రోడ్డుతో పాటు అప్రోచ్ రోడ్లను నిర్మించాలని, అదేవిధంగా ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ పదేళ్లలోనే వేలాది కోట్ల రూపాయలతో పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా మరికొన్ని ఏర్పాటు చేయించి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ధూలపల్లి పారిశ్రామికవాడలోని రోడ్ల నిర్మాణంతో పాటు వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణం, మౌలిక వసతులైన తాగునీటి సౌకర్యం, పార్కుల అభివృద్ధికి కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి వెంకటేశ్వర్ రావు, సభ్యులు ఇక్బాల్, శివ సుందర్, శశికాంత్, మేఘనాథ్ రెడ్డి, మూర్తి, శంకర్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ప్రణాళికతో ప్రగతినగర్ అభివృద్ధి

నిజాంపేట్: 30 ఏళ్లుగా ప్రణాళికతో ప్రగతినగర్ అభివృద్ధికి కృషి చేశామని మేడ్చల్ జిల్లా సీపీఎం కార్యదర్శి సత్యం, బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య అన్నారు. మేడ్చల్ జిల్లా సీపీఎం మూడో మహాసభల నేపథ్యంలో ప్రగతినగర్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతినగర్ ఏర్పాటు నుంచి పంచాయతీగా, ఆపై కార్పొరేషన్‌గా రూపాంతరం చెందడంలో సీపీఎం ప్రధాన భూమిక పోషించిందన్నారు. ఈ ప్రాంతానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా దేశంలోనే నంబర్‌వన్ పంచాయతీగా ప్రగతినగర్‌కు గుర్తింపు తెచ్చిన ఘనత సీపీఎంకు దక్కుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఆరుగురు సీపీఎం కార్పొరేటర్లు గెలుపొంది ఈ ప్రాంతాభివృద్ధికి మరింత కృషి చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, భవిష్యత్‌లో కూడా తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.